VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ ఆదివారం 23 జూన్ 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:01 సంచిక: 335

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



2లో

పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం జూడాల నిరసన

## తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతీస్తున్న ప్రభుత్వం



బొగ్గు గనుల వేలంలో పాల్గొనడమే నిదర్శనం

కాంగ్రెస్, బిజెపిలు తోడు దొంగలన్న కెటిఆర్

2లో



## సింగరేణికి అండగా ఉంటా

అనవసరంగా విమర్శలు చేస్తే సహించం

సింగరేణిని మభ్య పెట్టి

లబ్ది పొందిన బిఆర్ఎస్

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

2లో



# కేంద్రం పన్నుల వాటా సవరించాలి

కేంద్ర ప్రాయోజిత పథకాలపై పున:సమీక్షించాలి

సర్ చార్జీలు, సెస్ లపై 10 శాతం మించి ఉండొద్దు

వెనుబడిన జిల్లాలకు నిధుల కేటాయింపు పెంచాలి

ఫర్టిలైజర్స్ పై జీఎస్టీ 18 నుంచి 5 శాతానికి తగ్గించాలి

నిర్మలా సీతారమన్‌తో సమావేశంలో భట్టి విక్రమార్క ప్రతిపాదనలు

**న్యూఢిల్లీ:** విభజన చట్టంలో కేంద్రం నుంచి విడుదల కావాల్సిన రూ. 2200 కోట్లు ఇంకా విడుదల కాలేదని ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. .జీఎస్టీ సమావేశంలో పాల్గొన్న భట్టి రాష్ట్రాలకు పన్ను వెసులుబాటు ఇవ్వాలని కోరామన్నారు. మూలధనం వ్యయాన్ని పెంచి పథకాలు కొనసాగించాలన్నారు. ఆదాయ పంపిణీలో అసమానతలు పెరిగిపోతున్నాయన్నారు. కేంద్ర పన్నులతో రాష్ట్రాల ఆదాయం తగ్గిందని చెప్పారు. కొన్ని కేంద్ర ప్రాయోజిత పథకాలపై పున:సమీక్షించాలని కోరారు. సర్ చార్జీలు, సెస్ లపై 10 శాతం మించి ఉండొద్దన్నారు. స్కిల్ డెవల్ పమెంట్ సెటర్లను ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరామని మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. వెనుబడిన జిల్లాలకు నిధుల కేటాయింపు పెంచాలన్నారు. తెలంగాణకు మరిన్ని నవోదయ పాఠశాలలు పెంచాలన్నారు. మూసీ డెవలప్ మెంట్ ప్రాజెక్టుకు కేంద్ర సహకారం కోరామన్నారు. ఫర్టిలైజర్స్ పై జీఎస్టీ 18 నుంచి 5 శాతానికి తగ్గించాలని కోరినట్లు చెప్పారు. రాష్ట్ర సమస్యలపై మరోసారి నిర్మలాసీతారామన్ ను కలుస్తామని వెల్లడించారు. .

హైదరాబాద్ గ్లోబల్ సిటీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బొగ్గు వేలంపై బీఆర్ఎస్ నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారని .. వారి వల్లే బొగ్గు వేలం చట్టం వచ్చిందని చెప్పారు. బొగ్గు వేలం ఆపితే ఇల్లందు, సత్తుపల్లి గనులు ఎందుకు పోయాయని ప్రశ్నించారు. సింగరేణికి నష్టం జరిగేలా తమ సొంత వారికీ గనులు వచ్చేలా బీఆర్ఎస్ అధిష్ఠానం వ్యవహరించిందని ధ్వజమెత్తారు. అంతర్గత వనరులు సమీకరించుకుని తాము రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన ప్రీ బి÷-జడెట్,జీఎస్టీ కౌన్సిల్ సమావేశం శనివారం ఢిల్లీలో జరిగింది. ఈ సమావేశం భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ... కేంద్ర ప్రాయోజిత పథకాల్లో కొంత వెసులుబాటు కల్పించాలని కోరారు. ఆయా రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా నిధులు ఉపయోగించుకునే అవకాశం ఇవ్వాలన్నారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటుకు బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. సమాజంలో అసమానతలు తగ్గించేందుకు సమ్మిళిత అభివృద్ధి చేయాలని కోరారు. సెస్, సర్ ఛార్జ్ పన్నులు పది శాతం మించకుండా చేయాలన్నారు. రాష్ట్రాల నికర రుణపరిమితి సీలింగ్ ముందుగానే చెపితే దానికి అనుగుణంగా బ్జడెట్ పెట్టుకుంటామని స్పష్టం చేశారు. జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయింపులు ఉండాలని కోరారు. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద గత ఏడాది తెలంగాణకు 1.4 శాతమే నిధులు వచ్చాయని తెలిపారు. ఉపాధి హామీ నిధులు ఆస్తుల సృష్టి పనులకు వినియోగించేలా అనుమతులు ఇవ్వాలని కోరారు. మూసి రివర్ ఫ్రంట్‌కు నిధులు కేటాయించాలని కోరామని భట్టి విక్రమార్క అన్నారు.

# దూర ప్రయాణాలకు ఎక్స్‌ప్రెస్‌లు దూరం!

హైదరాబాద్: రాష్ట్రంలో మహిళలు ఉచితంగా ప్రయాణించడానికి వీలున్న ఎక్స్‌ప్రెస్ బస్సులను అవసరాలకు తగ్గట్టుగా ఆర్టీసీ పెంచడం లేదు. పూర్తి టికెట్ కొనాల్సిన డీలక్స్ బస్సుల వైపు వారిని మళ్లించేందుకు కొన్నిచోట్ల ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా డీలక్స్ బస్సు ఎక్కితే మహిళలకు బహుమతులు ఇస్తామంటూ కొత్త స్కీంను ప్రారంభించింది. జనగామ డిపో హనుమకొండ-హైదరాబాద్ మార్గంలో మూడు డీలక్స్ బస్సులను ప్రవేశపెట్టింది. ఈ బస్సుల్లో ప్రయాణిస్తే ప్రతి 15 రోజులకు ముగ్గురు మహిళలకు బహుమతులు ఇస్తామని ప్రకటించింది. ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో గతంలో సగటున 70-75 శాతం వరకు మాత్రమే నమోదయ్యేది. మహిళలకు ఉచిత ప్రయాణ పథకం అమల్లోకి వచ్చాక దాదాపు వంద శాతం ఉంటోంది. కేవలం ఎక్స్‌ప్రెస్ బస్సులనే తీసుకుంటే 120 శాతం దాటుతోంది. ఆర్డినరీతో పోలిస్తే ఎక్స్‌ప్రెస్‌లో సీట్లు కొంత మెరుగ్గా ఉంటాయి. బస్సు వేగం అధికం. ఆగే స్టాపులు, ప్రయాణ సమయమూ తక్కువ. దీంతో మహిళలు ఎక్కువగా ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణానికి ఆసక్తి చూపుతున్నారు. ఇదే అంశం ఆర్టీసీకి ఆర్థికంగా సమస్యగా మారింది. డీజిల్ సహా రోజువారీ నిర్వహణ ఖర్చులు, ఉద్యోగులకు నెల జీతాలకు ఇబ్బంది అవుతోంది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ మార్పులు చేస్తోంది.దూరప్రాంత

సర్వీసుల్ని రద్దు చేయాలని ఆర్టీసీ ఉన్నతాధికారుల నుంచి డిపో మేనేజర్లకు కొంతకాలం క్రితం అంతర్గత ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలోనే పలు అంతర్‌జిల్లా, అంతర్రాష్ట్ర సర్వీసులను రద్దు చేశారు. జనగామ నుంచి బాసరకు 30 ఏళ్లుగా ఎక్స్‌ప్రెస్ బస్సుంది. ఉచిత ప్రయాణ పథకం వచ్చిన తర్వాత బస్సులో రద్దీ భారీగా పెరిగింది. ఫిబ్రవరిలో జనగామ డిపో ఈ సర్వీసును రద్దు చేసింది.



రాష్ట్రంలో మహిళలు ఉచితంగా ప్రయాణించడానికి వీలున్న ఎక్స్‌ప్రెస్ బస్సులను అవసరాలకు తగ్గట్టుగా ఆర్టీసీ పెంచడం లేదు. పూర్తి టికెట్ కొనాల్సిన డీలక్స్ బస్సుల వైపు వారిని మళ్లించేందుకు కొన్నిచోట్ల ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా డీలక్స్ బస్సు ఎక్కితే మహిళలకు బహుమతులు ఇస్తామంటూ కొత్త స్కీంను ప్రారంభించింది.

అదనంగా డీలక్స్ బస్సులు ప్రవేశపెడుతున్న ఆర్టీసీ

ప్రయాణానికి కొన్నిచోట్ల బహుమతులతో ఆకర్షణ

## ఉద్యోగాలపై కేబినేట్‌లో ఎందుకు చర్చించలేదు

నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నా పట్టించుకోరా

సిఎం రేవంత్ రెడ్డికి బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు లేఖ



2లో

# హెల్త్ టూరిజం హబ్‌గా తెలంగాణ



**హైదరాబాద్:** తెలంగాణను మెడికల్ టూరిజం హబ్‌గా ఏర్పాటు చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇక్కడ అత్యంత అధునాతన ఆస్పత్రులు ఉన్నాయని, వాటిని కనెక్ట్ చేయాల్సి ఉందన్నారు. ఇందుకోసం మెడికల్ టూరిజం ప్రతిపాదన ఉందన్నారు. సీఎం హోదాలో తాను నిత్యం 18 గంటలు పనిచేస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ 24వ వార్షికోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆలోచనను కుటుంబ సభ్యులు కార్యరూపంలో పెట్టారని చెప్పారు. క్యాన్సర్ ను అరికట్టాలనేది గొప్ప ఆలోచన అని అన్నారు. భవిష్యత్ లోనూ బసవతారకంకు తోడుంటామని చెప్పారు. ఆస్పత్రి విస్తరణకు సహకరిస్తామని చెప్పారు. నిత్యం ఎంతో మందికి ఆస్పత్రి సేవలందిస్తుందని తెలిపారు. శంషాబాద్ ఎయిర్ పోర్టుకు పక్కన భూమి తీసుకుని మెడికల్ హబ్‌గా పెద్ద ఆస్పత్రులు కట్టిస్తామని తెలిపారు. హైదరాబాద్ కు వస్తే జబ్బు నయమౌతుందనేలా చేస్తామని అన్నారు. అభివృద్ధి సంక్షేమంలో తెలుగు రాష్ట్రాలు పోటీ పడుతాయని తెలిపారు. 24వ వార్షికోత్సవానికి బాలకృష్ణ ఆహ్వానించారని 30 వ వార్షికోత్సవానికి కూడా తానే వస్తానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బసవతారకం ఆసుపత్రి లక్షలాది మందికి సేవలందిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

నిస్వార్థంగా పేదలకు సేవలందించేందుకు ఆసుపత్రిని నిర్మించారని చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబుతో అభివృద్ధిలో పోటీపడే అవకాశం నాకు వచ్చింది. ఆయన 18 గంటలు పనిచేసి.. నేను 12 గంటలు పని చేస్తే సరిపోదు. తెలంగాణ రాష్ట్ర నేతలు, అధికారులు కూడా 18 గంటలు పని చేయాల్సిందే. అభివృద్ధిలో తెలుగు రాష్ట్రాలు పోటీ పడాలి.. ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలి. హెల్త్ టూరిజం హబ్ ఏర్పాటు చేయాలని చూస్తున్నాం అని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి తెలిపారు. అన్ని రకాల వైద్యసేవలు అందించేందుకు హెల్త్

- మిగతా 2వ పేజీలో

# నీట్ పరీక్ష రద్దు చేయండి

## కిషన్ రెడ్డి ఇంటిముందు విద్యార్థి సంఘాల ఆందోళన

**హైదరాబాద్:**నీట్ పరీక్ష రద్దు చేయాలంటూ హైదరాబాద్ కాచిగూడలోని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఇంటి ఎదుట విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆధ్వర్యంలో కేంద్రమంత్రి ఇంటిని విద్యార్థిసంఘాల నేతలు ముట్టడించారు. జాతీయస్థాయి వైద్యవిద్య ప్రవేశపరీక్షలో అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ.. నీట్ ఛైర్మన్ రాజీనామా చేయాలంటూ నినాదాలు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు ఆందోళన చేస్తున్న బల్మూరి వెంకట్ సహా విద్యార్థిసంఘాల నాయకులను నల్లకుంట ఠాణాకు తరలించారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం తక్షణం స్పందించి నీట్‌పై దిద్దుబాటు చర్యలు చేపట్టాలని బల్మూరి వెంకట్ డిమాండ్ చేశారు.






# అక్రమంగా వైసిపి కార్యాయల నిర్మాణం

**అమరావతి:** గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం సీతానగరంలో వైకాపా కార్యాలయం కోసం అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న భవనాన్ని అధికారులు కూల్చివేశారు. నీటి పారుదల శాఖ స్థలంలో పార్టీ కార్యాలయం నిర్మాణాన్ని చేపట్టారు. బోట్ యార్డుగా ఉపయోగిస్తున్న స్థలాన్ని తక్కువ లీజుతో వైకాపా కార్యాలయం కోసం అప్పటి జగన్ సర్కార్ కట్టబెట్టింది. ఈ అక్రమ నిర్మాణంపై వైకాపాకు సీఆర్డీఏ నోటీసులు జారీ చేసింది. శనివారం ఉదయం అధికారులు కూల్చివేతలు చేపట్టారు.ఇరిగేషన్ భూమిని ఆక్రమించి, అనధికారికంగా వైకాపా కడుతున్న పార్టీ కార్యాలయ నిర్మాణాన్ని ఎంటీఎంసీ అధికారులు కూల్చివేశారు. అధికారం అండతో తాడేపల్లిలో 2 ఎకరాల ఇరిగేషన్ భూమిని పార్టీ కార్యాల యానికి జగన్ కేటాయించుకున్నారు. 2 ఎకరాల్లో భవనాలు కట్టి.. మిగిలిన 15 ఎకరాలు కొట్టేయడానికి వైకాపా నేతలు ప్రణాళిక సిద్ధం చేశారు. స్థలం స్వాధీనానికి ఇరిగేషన్ శాఖ అంగీకారం లేదు. సీఆర్డీఏ, ఎంటీఎంఈ, రెవెన్యూ శాఖలు ఈ భూమిని వైకాపాకు హ్యాండోవర్ చేయలేదు. వైకాపా కార్యాలయ నిర్మాణానికి కనీసం ఎ÷-లాన్ కోసం కూడా దరఖాస్తు చేయలేదు. నీటిపారుదల శాఖ భూమిని కబ్జా చేసి.. ఏ ఒక్క అనుమతి లేకుండా కార్యాలయ నిర్మాణం చేపట్టారు. వైకాపా కబ్జాలపై తెదేపా గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. కబ్జాలు, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని సీఆర్డీఏ, ఎంటీఎంసీ కమిషనర్లను కోరారు. దీంతో ఎంటీఎంసీ ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత చేపట్టారు.

----

# పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం జూడాల నిరసన

**హైదరాబాద్:** దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా మెడికల్ కళాశాల జూనియర్ డాక్టర్లు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కళ్లకు గంతలు కట్టుకొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షుడు దీపాంకర్ మాట్లాడుతూ.. 'అధికారుల చుట్టూ తిరగకుండా ప్రతి నెలా నిర్దిష్టమైన తేదీకి స్టైఫండ్ ఇవ్వాలని ఎప్పటి నుంచో కోరుతున్నాం. కానీ, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఉస్మానియా ఆసుపత్రి భవనం మూసి వేసి నాలుగేళ్లు అయ్యింది. పక్కనే ఉన్న మరో భవనంలోకి ఆసుపత్రి మార్చారు. విపరీతమైన రద్దీ కారణంగా ఇన్‌ఫెక్షన్ల శాతం పెరుగుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మా డిమాండ్లపై లిఖితపూర్వక హామీ ఇవ్వాలని కోరారు.

## బీహార్‌లో కూలిన వంతెన తప్పిన ప్రమాదం

**పట్నా:** కొన్నేళ్లుగా వాడుకలో ఉన్న ఓ వంతెన ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటన బిహార్‌లో శనివారం చోటుచేసుకుంది. అయితే, ఇందులో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఈ వారంలో ఇది రెండో ఘటన కావడం గమనార్హం. బిహార్‌లోని సివాన్ జిల్లాలోని గండక్ కాలువపై ఉన్న వంతెన మహారాజ్‌గంజ్ జిల్లాలోని పటేఢి బజార్ మార్కెట్‌ను, దర్భంగాలోని రామ్‌గఢ్ పంచాయతీతో కలుపుతోంది. ఈ వంతెనపై నుంచి ప్రతిరోజూ వందల మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. కాగా శనివారం ఉదయం ఇది భారీ శబ్దంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఈ వంతెన దాదాపు 40 సంవత్సరాల క్రితం నిర్మించిందని, దీని నిర్వహణ సరిగ్గా లేకపోవడం వల్లే కూలిపోయిందని, అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వంతెన కుప్పకూలడంతో గండక్ కాలువ మీదుగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో స్థానికులు పొరుగు గ్రామాలకు వెళ్లడానికి చాలా దూరం ప్రయాణించాల్సి వస్తుందని వాపోయారు. బిహార్‌లోని అరారియా జిల్లాలో బక్రా నదిపై రూ.కోట్లు ఖర్చుపెట్టి నిర్మించిన ఓ వంతెన ప్రారంభానికి ముందే కుప్పకూలింది. వారం రోజుల వ్యవధిలోనే రాష్ట్రంలో రెండు వంతెనలు కూలిపోవడంపై ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

# బిజెపిలో అధ్యక్షపదవిపై పోటాపోటీ

**హైదరాబాద్:** బీజేపీ రాష్ట్ర కొత్త అధ్యక్షుడి నియామకంపై బిజెపిలో కలకలం రేగుతోంది. ఓ వైపు ఢిల్లీలో కొందరు పైరవీలు చేస్తుండగా, తాజాగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ వీడియో కలకలం రేపింది. ఈ క్రమంలో అధిష్టానం తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని మెదక్ ఎంపీ రఘునందన్ రావు స్పందించారు. 'పార్టీ అధిష్ఠానం ఆదేశాలను తప్పకుండా పాటిస్తాను. కండువా కప్పుకున్న రోజు నుంచే నేను పార్టీ కార్యకర్తను. కొత్తగా వచ్చిన నేతలకు పదవి రాదు అనేది ఏమి లేదు. హిమంత బిశ్వశర్మకు సీఎం పదవే వచ్చింది. క్రమశిక్షణ గల కార్యకర్తగా పనిచేస్తాను. ప్రజాస్వామ్యంలో ఎవరైనా అభిప్రాయాలు చెప్పవచ్చని అన్నారు ఈ క్రమంలోనే రాజాసింగ్ తన అభిప్రాయం చెప్పారు' అని అన్నారు.తెలంగాణ రాజకీయాలపైనా ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో గొర్రెల స్కాం, ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్ట్ అయిన అధికారులు అంతా కేసీఆర్ పేరే చెబుతున్నారని అన్నారు. అన్ని వేళ్లు కేసీఆర్‌వైపే చూపిస్తున్నాయని చెప్పారు. త్వరలోనే కేసీఆర్ ఇంటికి ఈడీ రాక తప్పదని అన్నారు. ఇదిలావుంటే రాష్ట్ర బీజేపీలో గ్రూపుల లొల్లి కొనసాగుతోంది. రాష్ట్ర అధ్యక్ష పదవికోసం పలువురు లీడర్లు తమ వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఢిల్లీ వెళ్లి అగ్రనేతలను కలిసి ఆశీస్సులు పొందుతున్నారు. మరికొందరు ఆర్ఎస్ఎస్ ద్వారా ప్రయత్నాలను ప్రారంభించారు. ఈ తరుణంలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన కామెంట్లు సంచలనం రేకెత్తించాయి. ఆయన విడుదల చేసిన వీడియో హాట్ టాపిక్ గా మారింది. పరోక్షంగా ఎవరికి రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వొద్దో ఈ వీడియోలో చెప్పేశారు. గత కాలంగా బీజేపీ స్టేట్ చీఫ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో రాజాసింగ్ కు గ్యాప్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. గతంలో బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు రెగ్యులర్ గా నాంపల్లి ఆఫీసుకు వచ్చి ప్రెస్ మీట్లు పెట్టిన రాజాసింగ్ ఇప్పుడు ఆఫీసు రావడం లేదు. గోషామహల్ ఎమ్మెల్యేగా గెలిచిన రాజాసింగ్ కు పార్టీ ఫ్లోర్ లీడర్ పదవిని ఇస్తారనే చర్చకూడా సాగింది. అయితే రకరకాల కారణాలతో కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన ఏలేటి మహేశ్వర్ రెడ్డికి ఫ్లోర్ లీడర్ పోస్టు అప్పగించారు. దీంతో ఆయన అలకబూనారని తెలుస్తోంది. తర్వాత పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. హైదరాబాద్ ఎంపీగా అభ్యర్థిగా కొంపెల్ల మాధవీలతను ప్రకటించిన నేపథ్యంలో రాజాసింగ్ చేసిన కామెంట్లు కలకలం రేపాయి. ఇటీవల హైదరాబాద్ లో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ల సన్మానం కోసం నిర్వహించిన 'సెల్యూట్ తెలంగాణ' సభకు కూడా రాజాసింగ్ హాజరు కాలేదు. మరుసటి రోజు (నిన్న) ఆయన ఓ వీడియో విడుదల చేశారు. ఇందులో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడి ఎంపిక ఎలా ఉండాలో చెప్పారు. ఈ వీడియో సందేశం చూసిన వారికి ఎవరిని నియమించవద్దో డైరెక్టుగానే చెప్పినట్టు అర్థమవుతోంది. ఈ వ్యాఖ్యల వెనుక ఉన్నదెవరు? ఎవరు పరోక్షంగా రాజాసింగ్ తో చెప్పించారనేది చర్చనీయాంశంగా మారింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షపదవి రేసులో ఐదుగురు నేతలున్నారు. ఎవరిక వారుగా తమ వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారని తెలుస్తోంది. మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, నిజామాబాద్ ఎంపీ అరవింద్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు తమ వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. రాజాసింగ్ కామెంట్ చేసినట్టు చూసుకుంటే వీరిలో ఈటల రాజేందర్ వామపక్ష భావాలున్న నాయకుడు. బీఆర్ఎస్ లో కొనసాగి బీజేపీలోకి మారారు. డీకే అరుణ గతంలో

కాంగ్రెస్ లో మంత్రిగానే విధులు నిర్వర్తించారు. రఘునందన్ రావు కూడా గతంలో బీఆర్ఎస్ లో చాలా కాలంపాటు పనిచేశారు. కేసీఆర్ కు

సన్నిహితుడిగా కూడా కొనసాగారు. ఇక మిగిలింది. రాంచందర్ రావు, నిజామాబాద్ ఎంపీ అరవింద్. వీళ్లిద్దరిలో రాంచందర్ రావు పూర్తి ఆర్ఎస్ఎస్ బ్యాక్ గ్రౌండ్ కలిగిన లీడర్. మొదటి నుంచి బీజేపీలోనే కొనసాగుతున్నారు. మరో నాయకుడు ధర్మపురి అర్వింద్ ఆయన రాజకీయ జీవితం బీజేపీలోనే ప్రారంభమైంది.

రాజాసింగ్ చెప్పిన రెండో స్వభావం దూకుడు అరవింద్ కు ఉంది. రాజాసింగ్ పరోక్షంగా అర్వింద్ కు మద్దతు ఇచ్చారా..? లేదా రాంచందర్ రావును సపోర్ట్ చేస్తున్నారా..? అన్న చర్చనడుస్తోంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా దేశం, ధర్మం పట్ల అవగాహన ఉన్నవారిని నియమించాలని రాజాసింగ్ కోరారు. పార్టీలో అందరి అభిప్రాయాలు తీసుకున్న తర్వాత అధ్యక్షుడి ఎంపిక జరగాలని, 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేల అభిప్రాయాలను తీసుకోవాలంటూ ఓ వీడియో విడుదల చేశారు. రాష్ట్రంలో బీజేపీ గ్రాఫ్ పెరుగుతోందని.. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమంటూనే దూకుడుగా వ్యవహరించే వ్యక్తికే పగ్గాలు అప్పగించాలనే మరో సూచన చేశారు.

# తెలంగాణ అభివృద్ధిని దెబ్బతీసిన కాళేశ్వరం

**హైదరాబాద్:** 'కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ అభివృద్ధిని చావు దెబ్బతీసిందని వక్తలు అన్నారు. సివిల్ కోర్టుకు ఉన్న అధికారాలు జుడీషియల్ కమిషన్‌కు ఉన్నాయి. మొత్తం ప్రాజెక్టుపై సమగ్ర న్యాయవిచారణ జరిపించాలి. తప్పుల తడక డిజైన్లకు ఎలా అనుమతిచ్చారు. ఇరిగేషన్ అంటేనే మాఫియాగా మారింది' అని పలువురు వక్తలు ఆరోపించారు. 'జుడీషియల్ కమిషన్‌లను బెదిరించే కేసీఆర్ భూస్వామ్య రాచరిక విధానాలను ఖండించండి, మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరిపించండి' అంటూ తెలంగాణ జలసాధన సమితి, తెలంగాణ రైతుసంక్షేమ సమితిల ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది.సమితి అధ్యక్షుడు నైనాల గోవర్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం వేసిన జుడీషియల్ కమిషన్ విచారణ ప్రభుత్వం రిఫరెన్స్ చేసిన విషయాల వరకు మాత్రమే పరిమితం అవుతుందని అన్నారు. జుడీషియల్ కమిషన్ అంటే సివిల్ కోర్టుకు ఉన్న అధికారాలు ఉంటాయని అన్నారు. న్యాయనిపుణుల సలహా తీసుకుని ఒక క్రిమినల్ ఫిర్యాదును తయారు చేసి సీఎంకు, డీజీపీకి, ఏసీబీకి పంపిద్దామని అన్నారు. కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో ఎన్డీఏ, టీఆర్ఎ?స, బీఆర్ఎస్ ప్రభుత్వాలు అనేక విషయాల్లో ఎవరినీ సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నాయని ఆరోపించారు.

సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ ప్రపంచంలో

అద్భుతమైన ప్రాజెక్టు అని చెప్పుకుంటున్న కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ అభివృద్ధిని చావు దెబ్బతీసిందని ఆరోపించారు.అసలు ప్రాజెక్టుకు ఎవరు అనుమతి ఇచ్చారు అని నీటిపారుదల విశ్లేషకులు సాంబశివరావు ప్రశ్నించారు. తప్పుల తడక డిజైన్లు, తడక లాంటి నిర్మాణాలు, వర్షం పడితే కొట్టుకు పోతాయని సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి అన్నారు. ఇరిగేషన్ అంటే మాఫియాగా మారిందని, ఇక్కడి డబ్బుతో ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోమాలోకి పోయిందని నైనాల గోవర్ధన్ అన్నారు. ఈ సమావేశంలో

వివిధ సంఘాల నాయకులు అన్వేష్‌రెడ్డి, దొంతి నర్సింహారెడ్డి, తెలంగాణ

ప్రజా చైతన్య వేదిక చైర్మన్ ప్రొఫెసర్ కె.వెంకట్‌నారాయణ,

బీఎల్ఎఫ్ చైర్మన్ నల్ల సూర్యప్రకాష్, పృథ్వీరాజ్‌యాదవ్ విఠల్, సోగరా బేగం, నరసింహ, సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాలపై కేబినేట్‌లో ఎందుకు చర్చించలేదు

హైదరాబాద్: గ్రూప్స్ అభ్యర్థుల, నిరుద్యోగుల డిమాండ్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు శనివారం బహిరంగ లేఖ రాశారు. గ్రూప్స్ అభ్యర్థులు, నిరుద్యోగులకు క్యాబినెట్ సమావేశంలో న్యాయం చేసేలా నిర్ణయాలు తీసుకుంటుంటారని ఎదురుచూశామని అన్నారు. గ్రూప్ అభ్యర్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు, సమస్యల గురించి ఎలాంటి చర్చ లేకుండా క్యాబినెట్ సమావేశం ముగించారని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాదే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి మరిచారని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు నెలకు రూ.4,000 భృతి ఇస్తామని మాట ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఇప్పటికే ఆరు నెలలు దాటిందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇచ్చిన ఉద్యోగాలకు రేవంత్ రెడ్డి నియామక పత్రాలను ఇచ్చారు తప్ప కొత్తగా ఒక్క ఉద్యోగం కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. మిమ్మల్ని నమ్మి అధికారంలోకి తీసుకొచ్చిన నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం రోడ్డున పడి అర్తనాదాలు చేయాల్సిన పరిస్థితికి తెచ్చారని చెప్పారు. గ్రూప్ 1, డిఎస్సీ తదితర ఉద్యోగాల కోసం చేపట్టిన నియామక పక్రియ కూడా ఉద్యోగార్థులకు చాలా ఇబ్బంది కరంగా మారిందన్నారు. కనీసం వారు చేస్తున్న విజ్ఞప్తిని వినే పరిస్థితిలో కూడా ప్రభుత్వం లేకపోవడం శోచనీయమన్నారు. మెయిన్స్‌కు 1 : 50 నిష్పత్తిలో కాకుండా, 1 : 100 నిష్పత్తిలో అభ్యర్థులను అనుమతించాలని కోరారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించిన గ్రూప్ 2 నోటిఫికేషన్‌లో 1:15 గా పేర్కొన్నప్పటికీ, అభ్యర్థుల కోరిక మేరకు 1:100 నిష్పత్తిలో మెయిన్స్‌కి ఎంపిక చేశారని గుర్తుచేశారు. గ్రూప్ 2కు రెండు వేల ఉద్యోగాలు, గ్రూప్ 3కి మూడు వేల ఉద్యోగాలు అదనంగా కలుపుతామని రేవంత్ మాట ఇచ్చారని.. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోటీ పరీక్షల మధ్య కాలవ్యవధి చాలా తక్కువ ఉండడం వల్ల అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఉద్యోగ నియామకాల పరీక్షల తేదీల మధ్య ఎక్కువ వ్యవధి ఉండేలా షెడ్యూల్ సవరించాలని హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు.

# సింగరేణికి అండగా ఉంటా

**హైదరాబాద్:** కేంద్రమంత్రిగా సింగరేణికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని కిషన్‌రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'సింగరేణి కార్మికులకు అన్ని రకాలుగా అండగా ఉంటానని అన్నారు.న సింగరేణిని రక్షించాల్సిన బాధ్యత 49 శాతం వాటా ఉన్న కేంద్రంపై కూడా ఉంది. ఆ సంస్థకు లాభం చేకూర్చే పని కేసీఆర్, కేటీఆర్, భారాస ప్రభుత్వం ఏనాడూ చేయలేదన్నారు. ఉద్యోగులకు, కార్మికులకు సొంత ఇంటి పథకం అంటూ మభ్యపెట్టారు. వైద్య సదుపాయం, కాంట్రాక్ట్ కార్మికుల రెగ్యులరైజ్, కోల్ ఇండియా కార్మికుల తరహా జీతాలు వంటి హామీలన్నీ తుంగలో తొక్కారు. తెలంగాణ బిడ్డగా సింగరేణి ప్రయోజనాలే నాకు ముఖ్యం. వేర్వేరు రాష్ట్రాల్లో ఏ ప్రభుత్వం ఉన్నా సరే సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని అన్నారు. రానున్న రోజుల్లో మనం కూడా ఆత్మనిర్భర్‌ను స్ఫూర్తిగా తీసుకొని సొంత కాళ్లపై నిలబడాలి. దేశంలో బొగ్గు ఉత్పత్తి మరింత పెరగాల్సి ఉంది. ఆ దిశగా నరేంద్రమోదీ ప్రభుత్వం పనిచేస్తోంది. అభివృద్ధికి అడ్డుపడొద్దని ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేస్తున్నా. త్వరలోనే సింగరేణికి సంబంధించిన అన్ని అంశాలపై సమీక్ష నిర్వహిస్తా. కోల్ ఇండియా కూడా వేలంలో పాల్గొంటోంది. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం చట్టం చేశాం. రాష్ట్రంలోని బొగ్గు గనులకు వేలం వేసుకోవాలని కేంద్రం ఎన్నోసార్లు చెప్పినప్పటికీ పట్టించుకోలేదు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రూ.2వేల కోట్ల ఆదాయం కోల్పోయాం. చట్టంతో మాకేం సంబంధం అని ఇవాళ భారాస నేతలు మాట్లాడుతున్నారు. చట్టం చేసిన సమయంలో వారు సభలోనే ఉన్నారు. దానికి మద్దతు ప్రకటించారు. సింగరేణి విషయంలో ప్రశ్నిస్తున్న నేతలు మైన్స్ వేలంలో ఎందుకు పాల్గొనలేదో సమాధానం చెప్పాలి. ఐరన్ వోర్, సున్నపురాయి గనులకు వేలం వేయకుండా నిర్లక్ష్యం చేశారు. ఓడిపోయామనే బాధలో కేటీఆర్ ఇష్టానుసారం మాట్లాడుతున్నారు.

## తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతీస్తున్న ప్రభుత్వం

**హైదరాబాద్:** కాంగ్రెస్, బిజెపిలు తోడుదొంగలని, సీఎం రేవంత్ రెడ్డిపై, ఆయన చెబుతున్న అబద్ధాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ముఖ్యమంత్రి గద్దెపై రేవంత్ ఎక్కిన తర్వాత కాంగ్రెస్, బీజేపీ కలిసి తెలంగాణ ప్రయోజనాలను తాకట్టుపెడుతున్న తీరు ప్రతి ఒక్క తెలంగాణ పౌరుడు గమనిస్తున్నారని చెప్పారు. రేవంత్, ఆయన ప్రభుత్వం చేస్తున్న అబద్ధాల ప్రచారం చూసి జోసెఫ్ గోబెల్స్ కూడా తన సమాధిలోనే తలదించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. 60 ఏండ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకొని పోరాటం చేసి తెలంగాణ సాధించుకున్న పార్టీ తమదన్నారు. మరోవైపు తెలంగాణ ప్రజల ఆకాంక్షలను వినకుండా వాటిని క్రూరంగా అణిచి, వేల మందిని చంపిన పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, తమ ప్రభుత్వం తెలంగాణలోని బొగ్గు గనుల అమ్మకాన్ని ఎల్లప్పుడూ వ్యతిరేకించిందన్నారు. అందుకే ప్రభుత్వం ఏ రోజూ వేలంలో పాల్గొనలేదని చెప్పారు. కానీ నేడు కాంగ్రెస్ పార్టీ నిస్సిగ్గుగా వేలంలో పాల్గొని తెలంగాణ ప్రయోజనాలను దెబ్బ కొడుతుందని తెలిపారు. గతంలో కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ పోకడలతో తెలంగాణ బొగ్గు గనులను వేలం వేసిందని, కానీ బీఆర్ఎస్ వ్యతిరేకించడంతో ఇప్పటిదాకా అక్కడ నుంచి ఒక ట్టటెడు బొగ్గు కూడా ఆ కంపెనీలు ఎత్తలేదని తెలిపారు. వేలంలో గనులను దక్కించుకున్న రెండు కంపెనీలు కేవలం బీఆర్ఎస్ పార్టీ సింగరేణి ప్రయోజనాల కోసం నిలబడడంతోనే మైనింగ్ ప్రారంభించలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ.. గనులను కేటాయించినా, కేవలం రాష్ట్ర ప్రభుత్వ కఠిన వైఖరి, నిబద్ధత వల్లనే ఆ కంపెనీలు సింగరేణి బొగ్గును తవ్వలేకపోయాయని చెప్పారు. ఆ పూర్తి క్రెడిట్ బీఆర్ఎస్‌కు దక్కుతుందన్నారు. కానీ రేవంత్ పేర్కొన్న ఆ రెండు కంపెనీలు మహారాష్ట్రలో కాంగ్రెస్, శివసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు టాక్లి, జెన, బెల్లోర గనులను దక్కించుకున్న విషయం మర్చిపోవద్దని హితవు పలికారు.తెలంగాణ ప్రజల హక్కులను, ఆస్తులను, వనరులను తాకట్టు పెట్టడంలో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు తోడుదొంగల్లా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే నదీ జలాల వాటాను వదులుకున్న కాంగ్రెస్ తీరును రాష్ట్ర ప్రజలు తెలుసుకున్నారని చెప్పారు. తాజాగా బీజేపీకి అందిస్తున్న సహకారంతో సింగరేణి సంస్థను ప్రైవేటుపరం చేయాలన్న కుట్ర అందరికీ తెలిసిపోయిందని వెల్లడించారు. గనుల వేలంలో పాల్గొన్న మిమ్మల్ని, మీ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని తెలంగాణ చరిత్ర క్షమించదని ఆగ్రహం వ్యక్తంచేశారు.


# హెల్త్ టూరిజం హబ్‌గా తెలంగాణ




టూరిజం హబ్ ఉంటుందన్నారు. అందులో బసవతారకం ఆసుపత్రికి తప్పకుండా స్థానం ఉంటుంది. వెయ్యి ఎకరాల్లో హెల్త్ టూరిజం హబ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రపంచంలోని ఎవరైనా హైదరాబాద్‌కు వస్తే అన్ని రకాల వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. ఎన్టీఆర్ ఆలోచనలో ఏర్పాటైన ఈ ఆసుపత్రి 24 ఏళ్లుగా కోట్లాది మందికి సేవ చేయడం ఆనందదాయకమని రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగించేందుకు చంద్రబాబు నాయుడు ఆసుపత్రిని పూర్తి చేసి పేదలకు సేవలు అందించడం అభినందనీయమన్నారు. నిరుపేదలకు వైద్యసేవలు అందించాలన్న ఎన్టీఆర్ ఆశయాలను అమలు చేయడం చూసి స్వర్గం నుంచి మనల్ని ఆశీర్వదిస్తానన్నారు. నిరుపేదలకు క్యాన్సర్ వ్యాధిని నయం చేసేందుకు వైద్యరంగంలో విశేష కృషి చేసిన ఎన్టీఆర్ బసవతారం ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆసుపత్రికి సంబంధించి ఎలాంటి సహకారం అందించాలన్నా మా ప్రభుత్వం అండగా ఉంటుందని ఆసుపత్రి ఛైర్మన్ బాలకృష్ణ హామీ ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమంలో చంద్రబాబు నాయుడుతో పోటీపడే అవకాశం వచ్చిందన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలుగు రాష్ట్రాలు ప్రపంచానికే ఆదర్శంగా నిలవాలన్నారు. ఎన్టీఆర్‌కు రాజకీయాలు, సంక్షేమం వారసత్వంగా వచ్చాయి.

రెండు కిలోల బియ్యంతో బసవతారకం ఆస్పత్రిని నిర్మించి పేదలకు అండగా నిలిచారని ఎన్టీఆర్ అన్నారు. ఎన్టీఆర్ మొదటి తరం అయితే, రెండో తరం చంద్రబాబు, బాలకృష్ణ అని, మూడో తరం లోకేష్, భరత్ అని రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ మూడో తరం కూడా దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. నందమూరి తారక రామారావు భార్య, బాలకృష్ణ తల్లి బసవతారకం క్యాన్సర్‌తో మరణించారు. ఆ సమయంలో క్యాన్సర్ చికిత్స అందుబాటులో లేదు. దీంతో కేన్సర్ బారిన పడిన పేదలు వైద్యం చేయించుకోలేకపోతున్నారు. అందుకే పేదలకు వైద్య సహాయం అందించేందుకు ఎన్టీఆర్ ఈ బసవతారకం ఆసుపత్రిని ప్రారంభించారు. డొనేషన్‌తో నడిచే ఈ ఆసుపత్రిలో పేదలకు అతి తక్కువ ఖర్చుతో వైద్యం అందుతుంది. అందుకే అన్ని ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి క్యాన్సర్ రోగులు

వచ్చి చికిత్స పొందుతున్నారు. క్యాన్సర్ మహమ్మారి ప్రజలను పట్టి పీడిస్తోందని బసవతారకం ఆసుపత్రి ఛైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆసుపత్రి సేవల విస్తరణ కోసం సీఎం రేవంత్‌రెడ్డి సహకారం కోరగానే అంగీకరించారని చెప్పారు. దాతల సహకారంతో ఆసుపత్రి ఈ స్థాయికి చేరుకుందని తెలిపారు. సేవలను మరింత విస్తరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు,





## నీట్ రద్దుతో విద్యార్థులకు నష్టం కొందరి వల్ల లక్షలాది మందికి కష్టం

న్యూఢిల్లీ: వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన 'నీట్- యూజీ2024 ప్రవేశపరీక్ష దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. పరీక్షకు ముందు రోజే పేపర్ లీకైందంటూ ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. మరోవైపు ఏకంగా 67 మంది విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడం అనుమానాలను మరింత బలపరుస్తోంది. పేపర్ లీకైనట్లు ఓ వైపు కేంద్రం పరోక్షంగా అంగీకరిస్తున్నా.. పరీక్షను రద్దుకు మాత్రం ససేమిరా అంటోంది. అసలు నీట్ పరీక్షను రద్దు చేయకపోవడానికి గల కారణాలను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వివరించారు. నీట్- యూజీ ప్రవేశ పరీక్ష పేపర్ లీకేజ్ వల్ల కొందరు విద్యార్థులు లాభపడి ఉన్నప్పటికీ.. పరీక్షను రద్దు చేస్తే ఎంతో కష్టపడి చదివి రాసిన లక్షలాది మంది విద్యార్థులు నష్టపోతారని పేర్కొన్నారు. పాసైన వారి కష్టమంతా వృథా అవుతుందని చెప్పారు. 2004, 2015లో ఈ తరహా ఘటనలే చోటు చేసుకున్నాయని, అయితే లీకేజీ వ్యవహారం భారీ ఎత్తున జరగడంతో అప్పట్లో పరీక్షను రద్దు చేసినట్లు గుర్తు చేశారు. అయితే, ఈసారి లీకేజీ కొన్ని సెంటర్లలో మాత్రమే జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయని, నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మరోవైపు నీట్-యూజీ 2024 కౌన్సెలింగ్ ప్రక్రియను వాయిదా వేసేందుకు సుప్రీం కోర్టు కూడా నిరాకరించింది. జులై 6న నిర్వహించాల్సిన కౌన్సిలింగ్‌ను యథాతథంగా కొనసాగించాలని శుక్రవారం ఆదేశించింది. అంతేకాకుండా పేపర్ లీకేజీపై పెనుదుమారం కొనసాగుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం కూడా కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షల నిర్వహణ ప్రక్రియలో సంస్కరణల కోసం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఏడుగురు సభ్యులుండే ఈ కమిటీకి ఇస్రో మాజీ చీఫ్ కె.రాధాకృష్ణన్ నేతృత్వం వహించనున్నట్లు తెలిపింది.

# జర్నలిస్టులు "హక్కుల కోసం పోరాడాలి".

### ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా, సమస్యల పరిష్కారంకు కృషి చేయాలి.

### టీడబ్ల్యూజేఎఫ్ కరీంనగర్ జిల్లా సమావేశంలో వక్తలు.

### అట్టహాసంగా నగరంలో ప్రెస్‌క్లబ్ ప్రారంభోత్సవం.



**వేగుచుక్క న్యూస్,కరీంనగర్, జూన్ 22**

కార్మికులు మొదలుకొని ఆయా రంగాల్లో పని చేసే ఉద్యోగులందరికీ ఉన్న చట్టాల మాదిరిగానే జర్నలిస్టులకూ హక్కులు కల్పించేలా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సంక్షేమ పథకాలూ అందేలా చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉందని, అందుకు జర్నలిస్టులు ఐక్యంగా పోరాడాలని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూనే, జనం సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. నిరంతర అధ్యయనం, ప్రజా చైతన్య కథనాలు అందిస్తూ సమాజశ్రేయస్సుల్లో తమకంటూ స్థానం పొందాలని పలువురు వక్తలు సూచించారు. శనివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్‌లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కరీంనగర్ ప్రెస్‌క్లబ్‌ను వివిధ రాజకీయపార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర, జాతీయనాయకులు కలిసి జ్యోతిప్రజ్వలన చేసి అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా వచ్చిన కరీంనగర్ మేయర్ వై.సునిల్‌రావు మాట్లాడుతూ, ప్రెస్‌క్లబ్‌కు అవసరమైన సౌకర్యాల కల్పనలో తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. తాను విద్యార్థి నాయకునిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించినప్పటి నుంచి మీడియా ప్రాధాన్యత, వారి అవసరం ఎంతగానో ఉందని నమ్ముతానని అన్నారు. ప్రభుత్వ వ్యవస్థల్లో ప్రజలకందించే సేవల్లో మీడియా కూడా నాలుగో స్తంభంగా ఉంటుందన్నారు. అనంతరం ఆల్ ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి జోజిరెడ్డి మాట్లాడుతూ, "జర్నలిస్టుల పేరుతో కొందరు ఇతర రంగాల్లో పని చేసే ఉద్యోగులు, వ్యాపారస్తులు అక్రిడిటేషన్‌కార్డులు పొందుతున్నారని, వారందరవీ రద్దు చేయించి, భవిష్యత్‌లో అనర్హులకు రాకుండా చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులను కోరారు". నిజమైన జర్నలిస్టులు, ఫీల్డ్ మీద ఉంటూ నిరంతరం వార్తలు సేకరించే జర్నలిస్టుల్లో కొంతమందికి సంక్షేమాల్లో అన్యాయం జరుగుతోందని, వీటిపైనా పోరాడాలని, అందుకు తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య మాట్లాడుతూ...తమ గోడును వెళ్లబోసుకునేందుకు ప్రెస్ క్లబ్ కు వచ్చే బాధితులకు విలేకరులు అండగా నిలిచి వారి పక్షాన వార్తలు అందించాలని అన్నారు. జర్నలిస్టుల ఇండ్ల సమస్యతో పాటు పలు ఇతర సమస్యలను నూతన ప్రభుత్వానికి ఇప్పటికే విన్నవించామని, ప్రభుత్వం ఏర్పడి ఆర్నెళ్లు మాత్రమే గడుస్తుండటంతో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేసేందుకు కొంత విరామం ఇచ్చామని,

రాబోయే రోజుల్లో స్పందించని పక్షంలో ఉద్యమాలు చేపడతామని అన్నారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఫెడరేషన్ మహాసభలు పూర్తిచేస్తామని, హక్కుల సాధన కోసం పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ప్రభుత్వం రాబోయే రోజుల్లో అక్రిడిటేషన్ సంఖ్యను కుదించాలనే
ఆలోచన చేస్తోందని, దీన్ని జర్నలిస్టులంతా సంఘటితంగా అడ్డుకుని పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కరీంనగర్‌లో ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు కృషి చేసిన సంఘం సభ్యులను అభినందించారు. ఈ ప్రెస్‌క్లబ్ ప్రారంభోత్సవంలో టీడబ్ల్యూజేఎఫ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కొమ్మెర తిరుపతిరెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, సీపీఐ నగర కార్యదర్శి సురేందర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, మాజీ జడ్పీటీసీ జోగిరెడ్డి, ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండోజు శ్రీకాంత్ సహా హుజూరాబాద్ డివిజన్ అధ్యక్షులు యోహాన్, జిల్లా, డివిజన్ కమిటీ సభ్యులు, భానుచందర్, రవికృష్ణ, రఫీక్, గణేష్, వెంకటరమణ, రాజు, సంతోష్, ఖాజాఖాన్, శ్రీనివాస్, శ్రీరాములు, నవీన్, శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, రామరాజు, ఎల్లస్వామి సహా వివిధ మండలాల నుంచి దాదాపు వంద మంది జర్నలిస్టులు పాల్గొన్నారు.

## డీవీకే" స్థూపావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 22:**



విప్లవోద్యమ నాయకుడు, ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి డీవీ కృష్ణ స్మారక స్థూపావిష్కరణ కార్యక్రమం పోస్టర్లను సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ ప్రజాపంథా నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం డీవీకే నగర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం.ఎల్)
మాస్ లైన్ నగర కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ,
డి.వి కృష్ణ పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యునిగా, రాష్ట్ర కార్యదర్శిగా, కేంద్ర కమిటీ సభ్యునిగా సుదీర్ఘకాలం పనిచేశారని, ఐఎఫ్టియు ఆలిండియా ప్రధాన కార్యదర్శిగా, బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేశారన్నారు. 50 సం౹౹ ల విప్లవ జీవితమంతా విప్లవోద్యమం నిర్మించటానికి చివరిదాకా డి.వి కృష్ణ చేసిన కృషికి గుర్తుగా ఆయన స్మారక స్థూపాన్ని నిర్మించాలని పార్టీ నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమానికి అతిథిగా పార్టీ ఆల్ ఇండియా కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాగూర్, రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కే.జీ రాంచందర్, కే.రమ తదితరులు మరియు వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుండి ముఖ్య నాయకులు వస్తున్నారన్నారు. జిల్లాలోని కార్మికులు కర్షకులు, విప్లవ అభిమానులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) డివిజన్ సహాయ కార్యదర్శి సాయగౌడ్, పీవోడబ్ల్యూ జిల్లా ప్రధానకార్యదర్శి కే.సంధ్యారాణి, పార్టీ పార్టీ నగర నాయకులు విఠల్, సాయిబాబా, అమూల్య, లలిత, వంశీకృష్ణ, గంగాధర్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

## చిత్రపురి కాలనీలో వీధికుక్కల దాడి

**ప్రాణాలతో బయటపడ్డ మహిళ**

**హైదరాబాద్:** నగరంలో మరోమారు వీధికుక్కలు దాడికి దిగాయి. వీధి కుక్కల గుంపు నడుచుకుంటూ వెళ్తోన్న ఓ మహిళపై దాడికి దిగిన ఘటన స్థానికులను భయాందోళనకు గురి చేసింది. వాటి దాడి నుంచి ఆ మహిళ అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడింది. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిత్రపురి కాలనీలో ఈ ఘటన జరిగింది. చిత్రపురి కాలనీలో నడుచుకుంటూ వెళ్తోన్న మహిళపై వీధికుక్కలు దాడికి యత్నించాయి. చుట్టుముట్టిన వీధి శునకాల బారి నుంచి తప్పించుకునేందుకు ఆ మహిళ గట్టిగా కేకలు వేసింది. వాటి నుంచి తప్పించుకునే క్రమంలో కిందపడిపోయినా.. కుక్కలను అదిలించే ప్రయత్నం చేసింది. ఇంతలో ఓ ద్విచక్రవాహనదారుడు, కారు రావడంతో కుక్కలు అక్కడి నుంచి వెళ్లిపోయాయి. ఈ దృశ్యాలన్నీ సమీపంలోని సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. బాధిత మహిళ భర్త ఈ దృశ్యాలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి.. ఊర కుక్కలకు ఇంటి బయట అన్నం పెట్టొద్దని విజ్ఞప్తి చేశారు. 'ఇంటి ముందు కుక్కలకు అన్నం పెడితే నా భార్యకు ఎదురైన పరిస్థితే మీకు కూడా రావొచ్చు' అంటూ పోస్టు చేసిన వీడియో వైరల్‌గా మారింది.

## అనర్హులు కార్డులు ఉంటే వాపస్ చేయాలి

**అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి మంత్రి పొంగులేటి స్పష్టీకరణ**



ఖమ్మం: అక్రమంగా, అర్హత లేకున్నా రేషన్ కార్డ్ కలిగివుంటే సరెండర్ చేయాలని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. అనర్హులు కార్డుఉల పొందితే అర్హులకు ప్రయోజనాలు దెబ్బతింటాయని అన్నారు. అనర్హులైన వారు తప్పుకుంటే మంచిదన్నారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లి మండలంలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మా ప్రభుత్వం ధనుకులకి కాదు బీదవారి ప్రభుత్వమని, ప్రజలకి అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ఎవరైనా అధికారులు ఎక్కువ చేస్తే నా పాలనలో ట్రాన్స్ఫర్లు ఉండవు డైరెక్ట్గా రిమూవ్ చేయడమేనని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజలకి ఎంత బాధ ఉంటే మీ మీద కంప్లైంట్ చేస్తారు అది అర్థం చేసుకోవాల్సిన బాధ్యత అధికారులదే అని ఆయన అన్నారు. ప్రజాసమస్యలు పట్టించుకోలేని వారిని ప్రభుత్వ ఉపేక్షించబోదని హెచ్చరించారు. అధికారులంతా సక్రమంగా పనిచేయాలని, కబ్జాకు గురైన వాటన్నిటిని బయటకు తీసి పేదోడికి అప్పజెప్పాలని ఆయన సూచించారు. ఇకనైనా ప్రతిపక్షాలు ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని పొంగులేటి తెలిపారు. మూడేళ్లలో అర్హులైన పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. ఎన్నికల వేళ ఇచ్చిన మాట ప్రకారం.. త్వరలోనే రేషన్ కార్డులు, పింఛన్లు ఇవ్వనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. రూ.31వేల కోట్లతో రైతుల రుణాలను మాఫీ చేయనున్నామని పొంగులేటి తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయని చెప్పారు.

## ఎంపీ అరవింద్ ఇల్లు ముట్టడి, లాఠీ ఛార్జ్.

### నీట్ పరీక్షను రద్దు చేయాలని విద్యార్థి సంఘాల ఆందోళన.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 22**



నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలని, ప్రధాని నరేంద్రమోడీ వెంటనే స్పందించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అందోళనలోనలో భాగంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఎంపీ అరవింద్ ఇల్లు ముట్టడి కార్యక్రమం చేపట్టారు. దీనితో విద్యార్థి నాయకులపై పోలీసులు లాఠీ ఛార్జ్ చేసి, అరెస్టు చేశారు. అనంతరం వారిని 3వ టౌన్ కి తరలించారు.
అరెస్టు అయిన విద్యార్థి సంఘాల నాయకులను ఎన్ఎస్ యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా ఇన్చార్జి వెంకటస్వామి పరామర్శించారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యూ జిల్లా అధ్యక్షులు గౌతం కుమార్, ఏఐపిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి బోడ అనిల్ కుమార్ లు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకై ఫలితాల్లో స్కామ్ జరిగిందని, ఒకే పరీక్ష కేంద్రంలో 8 విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని , ఒక్కో పరీక్ష పత్రం లీకేజీలో లక్షల రూపాయలు చేతులు మారాయని అన్నారు. లక్షలాదిమంది జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందని, ఓకే పరీక్ష కేంద్రంలో 67 మందికి ఎలా టాప్ ర్యాంకులు వస్తాయని,
సుప్రీంకోర్టులో కూడా పలు పిటిషన్లు దాఖలు అయ్యాయని పేర్కొన్నారు. నీట్ పరీక్ష ఫలితాలు జూన్ 14న విడుదల చేయాల్సి ఉండగా, ఎన్నికల ఫలితాల రోజే నాలుగున ఎందుకు విడుదల చేశారని అన్నారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఉన్నత స్థాయి దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. మోడీ వెంటనే రాజీనామా చేయాలని, ఎన్టిఏ ను రద్దు చేయాలని , నీట్ పరీక్ష ను మళ్ళీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, ఏఐపిఎస్యు సాయికుమార్, ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజ్ , ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేష్, విఘ్నేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు అంజలి, పిడిఎస్ యు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరేందర్, డా.గణేష్ , విద్యార్థి సంఘాల నాయకులు ప్రిన్స్, కార్తీక్, సాయినాథ్, నిఖిల్ రెడ్డి, గణేష్, ఆజాద్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

**మండిపడ్డ మాజీమంత్రి అమర్‌నాథ్**

విశాఖపట్నం,: ఏపీలో కూటమి పాలనలో అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కనపెట్టారని.. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ విమర్శించారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయాలను ఏపీ ప్రభుత్వం టార్గెట్ చేయడంపై శనివారం ఉదయం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీలో కూటమి సర్కార్ సాగిస్తున్న పాలన దేనికి సంకేతం?. కోర్టు ప్రొసీడింగ్‌లో ఉండగానే తాడేపల్లి కేంద్ర కార్యాలయాన్ని నేలమట్టం చేశారు. పైగా చేసిందంత చేస్తూ.. అసెంబ్లీలో నీతులు మాట్లాడుతున్నారు. ప్రభుత్వంలో ఉన్నామని ఏదైనా చేస్తామంటే పద్ధతి కాదు. ప్రజాస్వామ్యంలో అందరికీ అవకాశాలు వస్తాయి. మీకు వచ్చిన అవకాశాన్ని ఎలా వినియోగించుకుంటున్నా రనేది ప్రజలు గమనిస్తున్నారు' అని అన్నారాయన. అధికారంలోకి వచ్చిన పార్టీకి సమయం ఇచ్చిన అవసరం ఉందని, ఆరు నెలలు గడిచాక పరిస్థితుల్ని చూసి ప్రభుత్వం తీరును ఖండిద్దామని పార్టీ అధినేత వైఎస్ జగన్ తమతో చెప్పారని, కానీ, అధికారం చేపట్టి 20 రోజులు పూర్తి కాకముందే రాష్ట్రంలో ఈ తరహా పరిస్థితులు నెలకొన్నాయని అమర్నాథ్ ఆవేదన వ్యక్తం చేశారు.




# కల్కిలో విజయ్ దేవరకొండ కూడా ఉన్నాడా ?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్ అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం కల్కి. ఈ సినిమా జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదలకు ఇంకా 5 రోజులే ఉండడంతో ప్రమోషన్స్ గట్టిగా చేస్తున్నారు మేకర్స్. ఇప్పటికే టీజర్‌తో పాటు ట్రైలర్‌లు విడుదల చేయగా ఆకట్టుకున్నాయి.ఇదిలావుంటే శు క్రవారం రిలీజ్ ట్రైలర్ విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ యూట్యూబ్‌లో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. అయితే ఈ కొత్త ట్రైలర్‌లో మాళవికనాయర్?ను చూపించి సర్?ప్రైజ్ ఇచ్చారు మేకర్స్. ఇప్పుడు తాజాగా ఈ మూవీకి సంబంధించి ఒక సాలిడ్ రూమర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈ సినిమాలో రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ నటిస్తున్నట్లు తెలుస్తుంది. అశ్వథామ(కుంజరం)ను ఎదుర్కోనే పాత్రలో విజయ్ కనిపించబోతున్నట్లు నెట్టింట వార్తలు వైరల్ అవుతున్నాయి. దీనిపై మేకర్స్ ఎటువంటి క్లారిటీ ఇవ్వలేదు.



# సోనాక్షి ఇంట పెళ్లి సందడి



బాలీవుడ్ నటులు సోనాక్షి సిన్హా జహీర్ ఇక్బాల్ పెళ్లి చేసుకోబోతున్నారంటూ ఇటీవల జోరుగా ప్రచారం సాగిన సంగతి తెలిసిందే. ఆ రూమర్స్‌పై ఇద్దరూ ఇప్పటివరకూ స్పందించలేదు. బాలీవుడ్ వర్గాల సమాచారం మేరకు.. సోనాక్షి- ఇక్బాల్‌ల వివాహం ఆదివారం జరగనుందని తెలిసింది. ఈ నేపథ్యంలో ముంబయిలోని సోనాక్షి ఇంట నిర్వహించిన మెహందీ వేడుక ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. ఆ ఫంక్షన్‌కు ఇరు కుటుంబాలు, కొద్దిమంది అతిథులు హాజరైనట్టు సమాచారం. 'డబుల్ ఎక్స్‌ఎల్' సినిమాలో కలిసి నటించిన ఇక్బాల్, సోనాక్షిల మధ్య స్నేహం ఏర్పడింది. తర్వాత అది ప్రేమగా మారింది. తన కుమార్తె వివాహంపై వచ్చిన వార్తలపై ఇటీవల నటుడు శత్రుఘ్న సిన్హా స్పందించారు. 'ఇది నా ఒక్కగానొక్క కుమార్తె జీవితం. ఆమె అంటే నాకు అమితమైన ప్రేమ. నేనే తన బలం అని ఆమె ఎన్నోసార్లు చెప్పింది. తప్పకుండా తన పెళ్లికి వెళ్తా అని తెలిపారు. అంతకుముందు ఓ సందర్భంలో స్పందిస్తూ.. సోనాక్షి-ఇక్బాల్‌ల ప్రయాణం గురించి తనకేమీ తెలియదనడం గమనార్హం.



# అభిమానం పేరుతో అభిమానులు సైకోలుగా!

హత్య కేసులో అరెస్ట్ అయిన కన్నడ నటుడు దర్శన్ తప్పు చేస్తే గనుక తప్పకుండా కఠిన శిక్ష పడాలంటూ నటి రమ్యనంబీసన్ సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. దీంతో దర్శన్ అభిమానులు రమ్యపై సోషల్ మీడియా వేదికగా ఎటకింగ్ దిగారు. పెద్ద ఎత్తున అమెని ట్రోల్స్ చేసారు. బూతులు తిట్టారు. రకరకాల అసభ్య కామెంట్లతో వేదించారు. తాజాగా వాటిపై రమ్య స్పందించింది.

హత్య కేసులో ఉన్న వ్యక్తికి సహకరించే సమాజంలో మనం ఉన్నామా? ఇలా ఉన్నందుకు సిగ్గుగా అనిపించలేదా? సెలబ్రిటీ అయితే సాధారణ ప్రజల్ని కొట్టి చంపాలా? సెలబ్రిటీ అయితే మీలాంటి వాళ్లను రెచ్చగొట్టాలా? అసలైన హీరోయిజం అంటే ఇలాగే ఉంటుందా? మీరంతా నిజమైన అభిమానులే అయితే రోజు ఎన్నో సమస్యలొస్తున్నాయి? వాటి గురించి ఎందుకు మాట్లాడటం లేదు?చేతిలో నే ఫోన్ ఉంది? నిజాన్ని నిర్భయంగా మాట్లాడే మీలాంటి వాళ్లు అంతా అలాంటి పనులు చేయగల సమర్థులేనని నేను నమ్ముతున్నా? అని చెడామడా చెడుగుడు అడేసింది. ఇలాంటి కేసుల విషయంలో ఎలాంటి రాజకీయ పార్టీకి తలొగ్గకుండా పనిచేస్తారని పోలీసుల్ని ప్రజలంతా నమ్ముతున్నారు.ఇంతవరకూ అలాగే పనిచేసారు. అందుకు వారందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు. మాజీ నిర్మాత యాద్యురప్ప, మాజీ ఎంపీ ప్రజ్వల రేవణ్ణ,సూరజ్ రేవణ్ణ వంటి ప్రముఖులు కొన్ని కేసుల్లో ఆరోపణలు ఎదుర్కుంటున్నారు. వీళ్లందర్నీ కూడా జోడీస్తూ రమ్య ఆ వ్యాఖ్యలు చేసారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు వైరల్ గా మారాయి. రమ్య అభిమానులు, మద్దతుదారులంతా ఆమె వ్యాఖ్యలతో ఏకీభవిస్తూ పోస్టులు పెడుతున్నారు. పెద్ద ఎత్తున ఆమెకి మద్దతు లభిస్తుంది.



# కల్కి ట్రైలర్ చూసి రామ్ ఫిదా





మరో 5 రోజుల్లో ప్రభాస్ కల్కి సందడి మొదలు కానున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన టీజర్‌తో పాటు ట్రైలర్‌లు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా మేకర్స్ రిలీజ్ ట్రైలర్ విడుదల చేశారు. ఇక ఈ రిలీజ్ ట్రైలర్‌లో ఓ కొత్తలోకాన్ని ఆవిష్కరించాడు దర్శకుడు నాగ్‌అశ్విన్. ఇప్పటివరకూ వచ్చిన భారతీయ సినిమాలన్నీ ఒకెత్తు.. 'కల్కి 2898' ఒకెత్తు అనేలా ఉంది ఈ కొత్త ట్రైలర్.అయితే ఈ ట్రైలర్ చూసిన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఫిదా అవ్వడంతో పాటు ప్రశంసల వర్షం కురిపించాడు. అలాగే నెటిజన్లకు ఈ ట్రైలర్‌పై ఒక టాస్క్‌ను ఇస్తూ.. ఒక పజిల్‌ను పోస్ట్ చేశాడు. ఒక సెంటెన్స్ ఇచ్చి అందులో కొన్ని లెటర్స్‌ను మిస్ చేశాడు. ఈ పజిల్‌ను ఎవరైతే ముందుగా ఫిల్ చేస్తారో వాళ్లకి లక్ష రూపాయలను బహుమతిగా ఇస్తానని చెప్పాడు.

# స్నేహారెడ్డికి నచ్చే ఐస్‌క్రీమ్ బ్రాండ్?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ రేంజ్ ను పెంచిన చిత్రం 'పుష్ప: ది రైజ్' అయితే, అతడు రెట్టించిన ఉత్సాహం ఎనర్జీతో వ్యక్తిగత జీవితంలో ఆనందంగా ఉండటానికి కారణం భార్య స్నేహారెడ్డి. ఈ జంట అన్యోన్యత ఆనందమయ జీవన శైలి ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపుతుంది. అభిమానులకు జంట గోల్స్ ని నిర్దేశించే అరుదైన జంటగాను వీరు టాలీవుడ్ లో పాపులర్. అల్లు అర్జున్ - స్నేహారెడ్డికి పెళ్లయి ఇప్పటికి 12 ఏళ్లు అవుతోంది. వారికి అయాన్ అనే కుమారుడు, అర్హ అనే కుమార్తె ఉన్నారు. అయితే ఇద్దరు పిల్లలకు మామ్ అయినా కానీ స్నేహారెడ్డి ఇప్పటికీ టాప్ మోడల్ ని తలపిస్తుంది. సాటి హీరోల్లో షాహిద్ కపూర్ సతీమణి మీరా రాజ్ పుత్ తో స్నేహారెడ్డి పోలికలను అభిమానులు చూస్తుంటారు. స్నేహ వ్యక్తిగతంగా ఎంత సింపుల్ గా ఉంటారో ఇదిగో ఇక్కడ ఈ ఫోటోలు చూస్తేనే అవగతమవుతుంది.ఇదిగో ఇప్పుడు స్నేహా ఇలా తనకు ఇష్టమైన ఐస్ క్రీమ్ లను లాగించేస్తూ ఆ ఫోటోలను సోషల్ మీడియాల్లో షేర్ చేయడంతో అభిమానుల్లో వైలర్ గా మారుతున్నాయి ఈ ఫోటోలు. కేవలం ఐస్ క్రీమ్ లు మాత్రమే కాదు తనకు నచ్చే స్వీట్స్ కూడా ఈ ఫోటోల్లో కనిపించాయి.గతంలో సమంత టాక్ షో సామ్ జామ్‌లో కనిపించిన అల్లు అర్జున్ తన భార్య స్నేహ ప్రత్యేకత గురించి మాట్లాడాడు. "స్నేహలో నాకు రెండు లక్షణాలు నచ్చాయి.. తను చాలా డిగ్నిఫైడ్. నైట్‌క్లబ్‌లో తెల్లవారుఝామున 2 గంటలకు కూడా తన గురించి అసభ్యకరమైన ఫిర్యాదు ఏదీ లేదు. తనకు చాలా గౌరవం ఉంది.. లైఫ్ లో చాలా బ్యాలెన్స్‌డ్‌గా ఉంటుంది" అని బన్ని చెప్పాడు.

# రామోజీలో అనుష్క ఘాటి మూవీ షూటింగ్



కథానాయికా ప్రాధాన్యం ఉన్న చిత్రాలకు కేరాఫ్ స్వీటీ అనుష్క. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా బలమైన పాత్రలు, నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలతో మెప్పించి తెలుగునాట అద్భుతమైన గుర్తింపు పొందారు. గత ఏడాది 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' చిత్రంతో మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. తాజాగా క్రిష్ దర్శకత్వంలో ఆమె 'ఘాటి' చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ రామోజీ ఫిల్మ్‌సిటీలో జరుగుతోంది.అనుష్క, విక్రమ్ తదితరులపై మార్కెట్ నేపథ్యంలో సాగే పాటను చిత్రీకరిస్తున్నారు. రాజు సుందరం నృత్య దర్శకత్వం వహిస్తున్నారు. అంతే కాదు కీలక సన్నివేశాల చిత్రీకరణకు కూడా దర్శకుడు ఎ÷–లాన చేస్తున్నారు. ఇటీవలే 'కథనార్..' చిత్రంతో మలయాళంలోకి అడుగుపెట్టింది అనుష్క. ఈ సినిమా కూడా చిత్రీకరణ దశలో ఉంది.

# నక్కిన దర్శకత్వంలో సందీప్ కిషన్



దర్శకుడు నక్కిన త్రినాథ రావు, రచయిత బెజవాడ ప్రసన్న కుమార్ మళ్ళీ చేతులు కలిపి ఒక సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తుండగా, ఇంకొక ప్రధాన పాత్రలో రావు రమేష్ నటిస్తున్నారు. రీతు వర్మ, అన్షు అంబానీ లు సందీప్, రావు రమేష్ పక్కన జోడీగా నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ఇప్పుడు హైదరాబాదులో అవుతోంది. ఇందులో సందీప్ కిషన్, రీతు వర్మ, అన్షు అంబానీ, ఇంకా మరికొంతమంది ఆర్టిస్టులు వున్నారని కూడా తెలిసింది. అయితే ఈ సినిమాకి ఇంతవరకు ఎటువంటి టైటిల్ పెట్టలేదు, ఈ సినిమా అధికారికంగా ప్రకటించినప్పుడు కేవలం ÷ూఐ30 అని మాత్రమే అన్నారు. అయితే ఇప్పుడు ఈ సినిమాకి టైటిల్ ఖరారు అయినట్టుగా తెలుస్తోంది. ఇంతకు ముందు నక్కిన త్రినాథ రావు, రవి తేజ కాంబినేషన్ లో 'ధమాకా' సినిమా విజయవంతమై రూ.100 కోట్లకి పైగా కలెక్టు చేసిందని తెలుసు కదా. ఇప్పుడు ఈ సందీప్ కిషన్ సినిమాకి కూడా అలాంటి టైటిల్ ఉంటే బాగుంటుంది అని నక్కిన త్రినాథ రావు, బెజవాడ ప్రసన్న కుమార్ ఇద్దరూ అనుకున్నారు. అందుకే ఈ సినిమాకి 'మజాకా' అని టైటిల్ పెడుతున్నట్టుగా తెలిసింది. ఈ విషయాన్ని ఇంకా అధికారికంగా ప్రకటించలేదు, కానీ కొన్ని రోజుల్లో ఈ సినిమా టైటిల్ రెవీల్ చెయ్యొచ్చు అని తెలిసింది. రాజేష్ దంద ఈ సినిమాకి నిర్మాత.



# కల్కిలో రోజుకో సర్‌ప్రైజ్

## తెరమీదకు వచ్చిన మాళవికా నాయర్

కల్కి 2898 ఏడీ' చిత్రంలో పలు అతిథి పాత్రలున్నాయని, ఇంతకుముందు వైజయంతీ నెట్‌వర్క్ చిత్రాల్లో సందడి చేసిన కొందరు ఆ క్యారెక్టర్లు ప్లే చేస్తున్నారని ఇటీవల ప్రచారం జరిగింది. దీనిపై చిత్ర బృందం ఇప్పటివరకూ స్పందించలేదు. కానీ, 'రిలీజ్ ట్రైలర్' లో ఓ హీరోయిన్‌ను చూపించి అభిమానులను సర్‌ప్రైజ్ చేసింది. ఆమే మాళవిక నాయర్. గతంలో వైజయంతీ నెట్‌వర్క్ బ్యానర్‌లలో తెరకెక్కిన 'ఎవడే సుబ్రహ్మణ్యం', 'మహానటి'లోను ఆమె కీలక పాత్రలు పోషించి, మెప్పించారు. దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన ఈ మూడు చిత్రాల్లో ఆమె నటించడం విశేషం. అదే నెట్‌వర్క్‌లో వచ్చిన 'అన్నీ మంచి శకునములే'లోనూ ఆమె సందడి చేశారు. ట్రైలర్‌లోని తన లుక్‌ని స్క్రీన్‌షాట్ తీసి, అభిమానులు సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా మాళవిక ఆనందం వ్యక్తంచేశారు. వాటిని తన ఇన్‌స్టా ఖాతాలో షేర్ చేస్తూ థ్యాంక్స్ చెప్పారు. కొన్ని రోజుల క్రితం విడుదలైన తొలి ట్రైలర్ ద్వారా ఈ సినిమాలో అలనాటి హీరోయిన్ శోభన ఉన్నారని తెలిసింది. ఆ తర్వాత చిత్ర బృందం అధికారికంగా ప్రకటిస్తూ ఆమె లుక్‌ని షేర్ చేసింది. విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్, మృణాల్ ఠాకూర్ ప్రత్యేక పాత్రల్లో కనిపించనున్నారని రూమర్స్ వచ్చాయి. నాగ్ అశ్విన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఎన్నో సర్‌ప్రైజ్ లుంటాయని తెలిపారు. మరి, ఆయన ఈ రోల్స్ గురించే చెప్పారా, వేరే దాని గురించా? అంటే వేచి చూడాల్సిందే. ప్రభాస్ హీరోగా రూపొందిన ఈ సైన్స్ ఫిక్షన్ మూవీలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, రాజేంద్ర ప్రసాద్, దీపికా పదుకొణె, దిశా పటానీ కీలక పాత్రలు పోషించిన సంగతి తెలిసిందే. కాశీ, కాంప్లెక్స్, శంబల అనే మూడు ప్రపంచాల చుట్టూ తిరిగే కథతో తెరకెక్కిన ఈ సినిమా ఈనెల 27న విడుదల కానుంది.

